
## ఇంటింటికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

టేక్మాల్, నవంబర్ 15 : మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ మండల నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరువైందన్నారు. ప్రచారంలో ఆయన వెంట పార్టీ ప్రధాన కార్యదర్శి అవినాశ్, బీఆర్ఎస్ జిల్లా యువత కార్యదర్శి భాస్కర్, నాయకులు రాజు, సిద్ధయ్య, సలీం, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు పథకాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జంగం శ్రీనివాస్

పెద్దశంకరంపేట, నవంబర్ 15 : గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కృషి చేయాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చూడాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. వైస్ ఎంపీపీ లక్ష్మి , ఎంపీడీవో రఫికున్నీసా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి

అల్లాదుర్గం, నవంబర్ 15 : వాహదారులు పోలీసుల సూచనలు పాటించి వాహనాలను నడపాలని ఎస్సై ప్రవీణ్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని రాంపూర్ చౌరస్తా వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మృతులు ఇద్దరూ మైనర్లు కావడం బాధాకరమన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ,మద్యం సేవించి వాహనాన్ని నడపరాదన్నారు. ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని,కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. పోలీసులు ఉన్నదే ప్రజల రక్షణ కోసమని, పోలీసుల సూచనలు పాటించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు.

## మైనార్టీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

అల్లాదుర్గం, నవంబర్ 15 : అందోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ మైనార్టీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని అల్లాదుర్గం మండల కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ సయ్యద్ అన్నారు. ఈ నెల 17న జోగిపేటలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఇట్టి సమ్మేళనానికి హోం మంత్రి మహమూద్ అలీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 'ఖేడ్' ఎన్నికల బరిలో 18 మంది

నారాయణఖేడ్, నవంబర్ 15: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నారాయణఖేడ్ అసెంబ్లీ స్థానానికి 18 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్ తెలిపారు. ఈనెల 3న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. మొత్తం 22 మంది నామినేషన్లు దాఖలు చేయగా రెండు నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా, మిగిలిన 20 మంది అభ్యర్థుల్లో బుధవారం ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. జనతా కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అబ్దుల్ రహీం, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన కోటగిరి మరకల సాయన్న తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

# సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించాలి

- స్థానిక బిడ్డగా ఆశీర్వదించండి
- అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

అల్లాదుర్గం, నవంబర్ 15 : పేదలకు మంచి చేసేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన బీఆర్ఎస్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని వెంకట్రావుపేట, రెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంక్షేమం, అంధకారమే మిగులుతుంది. కర్ణాటక లెక్క కరెంట్‌కు గోసపడాల్సిందే. ఓట్ల కోసం మాత్రమే వచ్చే ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు సాయికుమార్,రామాగౌడ్,తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రాంతికిరణ్, నాయకులు

## ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



పెద్దశంకరంపేట : బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, నవంబర్15 : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని నారాయణఖేడ్ ఎమ్మె ల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ క్యాంపు కార్యాలయంలో పెద్దశంకరంపేట మండలం వీరోజిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరోజిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ అధ్యక్షుడు సంగమేశ్వర్‌తో పాటు గణేశ్, భాను, బాబురాథోడ్, వెంకటేశం, తదితరులు పార్టీలో చేరారు. జడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు, నాయకులు బెజుగం అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

**నారాయణఖేడ్‌లో..**

నారాయణఖేడ్, నవంబర్ 15: అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని నారాయణఖేడ్ బీఆర్ఎస్ అభ్యర్థి మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నారాయణఖేడ్ మండలం నాగాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు ప్రభాకర్, సంజీవ్‌రెడ్డి, అంజిరెడ్డి, మంజునాయక్, కిషన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.



నాగాపూర్ ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



రేగోడ్ మండలంలోని గజ్వాడ గ్రామంలో బుధవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా దుర్గమ్మగుడిలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ అందోల్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్. -రేగోడ్, నవంబర్ 15

## గ్రామాల్లో జోరుగా ప్రచారం



అందోల్ : జోగిపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

అందోల్, నవంబర్ 15 : ఈ నెల 30న జరుగనున్న ఎన్నికల్లో స్థానిక అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా పంపాలని పార్టీ శ్రేణులు గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం అందోల్-జోగిపేట మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానికులతో మమేకమై ఇంటింటికీ తిరుగుతూ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

## అందోల్ పోటీలో 18 మంది అభ్యర్థులు

అందోల్, నవంబర్ 15 : అందోల్ అసెంబ్లీ స్థానానికి 22 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. బుధవారం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు విత్‌డ్రా చేసుకోగా ..18మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారి పాండు తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఎస్పీ పలువురు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అబ్జర్వర్ దీపక్‌సింగ్లా పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

## జోరుగా బీఆర్ఎస్ ప్రచారం



ఇంటింటి ప్రచారంలో క్రాంతికిరణ్ సతీమణి పద్మావతి

రేగోడ్, నవంబర్ 15: మండలంలోని పోచారం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికరణ్ సతీమణి పద్మావతి ఇంటింటి ప్రచారం చేశారు. క్రాంతికరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. గ్రామాధ్యక్షుడు చెవుల బాలయ్య, ఉపాధ్యక్షుడు బశిరాం, యువకులు శరత్, ప్రతాప్ కుమార్, బోయిని శేఖర్,గొల్ల కృష్ణ,శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ నర్సిహులు, నాయకులు ఎం నర్సిహులు, మెదక్ జిల్లా రైతు బంధు సమితి సభ్యుడు బసంత్, గజ్వాడ నర్సిహులు,రఫీ, సురేశ్, ముకుంద్, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.